డబుల్‌బెడ్రూమ్‌లను వేగంగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 17 : నిర్మాణ దశలో ఉన్న డబుల్‌బెడ్ రూమ్‌లను వేగంగా పూర్తి చేయాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ అధికారులతో డబుల్‌బెడ్ రూమ్ నిర్మాణ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్ రూమ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని అధికారులకు సూచించారు. అలాగే డెత్ కేసుల్లో కుటుంబ సభ్యులను సంప్రదించి, అందరి అంగీకారంతో లబ్ధిదారుడికి సర్టిఫికెట్‌ను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు, తాసీల్దార్లు, జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీఆర్‌ఐలో క్రీడాపోటీలు

ప్రారంభించనున్న నైనా జైస్వాల్

సిటీబ్యూరో, జనవరి 17(నమస్తే తెలంగాణ) : సీఎస్‌ఐఆర్–ఎన్‌జీఆర్ ఐలో శాంతి స్వరూప్ భట్నాగర్ స్మారక క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు, ఎన్‌జీఆర్‌ఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలను అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి డా. నైనా జైస్వాల్, బ్యాడ్మింటన్ ప్లేయర్ పూర్వీ సింగ్ ప్రారంభించనున్నారు.

డిజిటలైజేషన్ దిశగా హైదరాబాద్ భూములు.!

- అన్యాక్రాంతం కాకుండా చర్యలు
- హైదరాబాద్ ఆస్తుల రక్షణకు ఏర్పాట్లు
- వచ్చే నెలలో భూముల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి

అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్న జిల్లా కలెక్టర్

త్వరలో జిల్లా రెవెన్యూ, తాసీల్దార్లతో ప్రత్యేక సమావేశం

సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా, కబ్జాలు కాకుండా రక్షించడంపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి దృష్టి సారించారు. జిల్లాలో ఉన్న భూముల విలువ కోట్లలో ఉంది. దీంతో చాలా మంది పలుకుబడి ఉన్న బడా బాబులు, సంపన్న వర్గాలకు చెందిన వారు తమ పలుకుబడితో జిల్లాలో ఉన్న వందల ఎకరాల భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతులకు చెందిన భూములతో పాటు ప్రభుత్వానికి చెందిన అనేక భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోతున్నాయి. ఈ క్రమంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ భూములను కాపాడటం కోసం జిల్లాలో నూతన విధానాన్ని ప్రవేశ పెట్టే దిశగా జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని రకాల భూములను డిజిటలైజేషన్ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నారు. భూముల డిజిటలైజేషన్ పనులు ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ.. ప్రస్తుతం సిబ్బంది మొత్తం ఆరు గ్యారంటీలు, ఇతర పనుల్లో నిమగ్నమయ్యారన్నారు. ఈ క్రమంలో వచ్చే నెలలో సిబ్బందిని పరిగణనలోకి తీసుకుని భూములను డిజిటలైజ్ చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. వచ్చే నెలలో మండలాలు, గ్రామాల వారీగా ఉన్న భూములను గుర్తిస్తామని, ఇందుకోసం స్థానిక తాసీల్దార్‌తో సర్వే నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఎన్ని భూములు ఉన్నాయి? ఏయే సర్వేలో ఉన్నాయి? ఓనర్లు పరిస్థితి ఏమిటీ వంటి సమగ్ర సమాచారాన్ని డిజిటలైజేషన్ చేస్తామన్నారు. అయితే డిజిటలైజేషన్ కంటే ముందుగానే సంబంధిత రెవెన్యూ అధికారులతో పాటు తాసీల్దార్లతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను ప్రారంభించే ముందు తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకున్నాకే డిజిటలైజేషన్‌ను ప్రారంభిస్తామని జిలా కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో ప్రభుత్వానికి సంబంధించిన భూములు, అసైన్డ్ భూములు, ఎండోమెంట్ భూములతో పాటు పలు ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు ఇతరత్రా భూములను కాపాడటం కోసం డిజిటలైజేషన్ చేయాల్సిన తప్పనిసరి పరిస్థితి నెలకొన్నదని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై జిల్లా అదనపు కలెక్టర్, డీఆర్‌వో, హైదరాబాద్, సికింద్రాబాద్‌కు చెందిన ఆర్‌డీవో వంటి అధికారులతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. అయితే ఫిబ్రవరి నెలాఖరుకు లేదా మార్చి నాటికి జిల్లాలో ఉన్న అన్ని రకాల భూములను డిజిటలైజ్ చేయడం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని (స్పెషల్ డ్రైవ్) నిర్వహించడానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఓఆర్ఆర్ నార్సింగి వద్ద రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన కళాఖండం

ఐఐఎస్ఎఫ్ సదస్సులో సీడీఎఫ్‌డీ ప్రదర్శన

సిటీబ్యూరో, జనవరి 17(నమస్తే తెలంగాణ) : హర్యానాలోని ఫరీదాబాద్ కేంద్రంగా ప్రారంభమైన నాలుగు రోజుల ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. బుధవారం ప్రారంభమైన ఈ సదస్సులో హైదరాబాద్‌కు చెందిన పరిశోధకులు సీడీఎఫ్‌డీ చేస్తున్న పరిశోధనలను వివరించారు. జాతీయ, అంతర్జాతీయంగా ముఖ్యమైన పరిశోధన, లైఫ్ సైన్స్ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొనన్నారు. విద్యార్థులు, యువ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సు జరుగుతుండగా, హైదరాబాద్ నుంచి సీడీఎఫ్‌డీ పాల్గొంది. ఈ నేపథ్యంలో లైఫ్ సైన్సెస్ రంగంలో పరిశోధనల తీరు, స్టార్టప్ ఎకో సిస్టంపై ఈ సదస్సులో చర్చిస్తారని సీడీఎఫ్‌డీ వర్గాలు వెల్లడించాయి.

ఇబ్బంది పడిన ప్రయాణికులు

సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ కోసం నగరం నుంచి జిల్లాల్లో ఉన్న సొంతూళ్లకు వెళ్లి, తిరిగి సొంత ఊర్ల నుంచి నగరానికి చేరుకునే ప్రయాణికులకు ఆర్టీసీ నరకం చూపించింది. పండుగకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడంలో వైఫల్యం చెందిందన్న అపవాదును ఆర్టీసీ మూటగట్టుకొంది. ఆదాయమే ప్రధాన ఎజెండాగా ఏర్పాటు చేసుకున్న ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికుల అవసరాలను పూర్తిగా గాలికి వదిలేసింది. పండుగ నేపథ్యంలో ఆర్టీసీ గ్రేటర్ జోన్ నుంచి జిల్లాలకు ఏర్పాటు చేసిన దాదాపు 1500 బస్సుల్లో కూడా 25 శాతం వరకు ఆక్యుపెన్సీ అదనంగా పెరిగినట్లు ఆర్టీసీ అధికారులు ధృవీకరిస్తున్నారు. ముఖ్యంగా సంక్రాంతి నేపథ్యంలో గత ఐదు రోజుల్లో ఇదే ఆక్యుపెన్సీ నమోదైంది. ఈ క్రమంలో రోజుకు దాదాపు రూ.5 కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చుకున్నారు. మహాలక్ష్మీ పథకం అమలు, జీరో టిక్కెట్‌తో కలుపుకొని ఈ మేరకు ఆదాయం రాబట్టుకున్న ఆర్టీసీకి కేవలం ఆరు రోజుల్లోనే రూ.30 కోట్ల వరకు ఆదాయం వచ్చినట్లు చెబుతున్నారు.

ఘట్‌కేసర్‌లో ఆపరేషన్ ముస్కాన్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 17: ఘట్‌కేసర్ పట్టణంలో స్థానిక పోలీసులు, ఆపరేషన్ ముస్కాన్ స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి వివిధ దుకాణాల్లో పని చేస్తున్న ఏడు మంది బాలలను గుర్తించారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎం.మహేందర్ రెడ్డి కథనం ప్రకారం.. ఘట్‌కేసర్‌లోని పలు షాపులు, దుకాణాల్లో ఏక కాలంలో దాడులు చేసి..అందులో పని చేస్తున్న బాలకార్మికులను పట్టుకున్నారు. బాలకార్మికులతో పనులు చేయిస్తున్న యాజమానులపై కేసులు నమోదు చేశారు. పట్టుకున్న 7 మంది బాలకార్మికులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ కేంద్రాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

21న జాతీయ ప్రకృతి విజ్ఞాన చికిత్స సదస్సు

ఖైరతాబాద్, జనవరి 17: సిద్ధార్థ యోగా విద్యాలయం, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఈనెల 21న ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో జాతీయ ప్రకృతి విజ్ఞాన చికిత్స సదస్సును నిర్వహించనున్నట్లు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షుడు డాక్టర్ గున్నా రాజేందర్ రెడ్డి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాంధారి ప్రభాకర్, మహిళా కన్వీనర్ యానాల రాధికతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సాహితీ కన్వీనర్ గిరిధర్, పర్యావరణ విభాగం కన్వీనర్ టి.సురేందర్, ప్రచార కార్యదర్శి కె.సుభాష్ చంద్ర, గ్రామ నిర్మాతల విభాగం కన్వీనర్ గోవర్ధన్, కోఆర్డినేటర్ సాయితేజ, శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 వరకు గడువు పొడిగింపు

వ్యవసాయ యూనివర్సిటీ , జనవరి 17 : గిరిజన సంక్షేమ గురుకులాల్లో నిర్వహించే 5వ తరగతి ప్రవేశ పరీక్షకు ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రాంతీయ సమన్వయకర్త పి.ఎస్ కల్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల విద్యార్థులు సకాలంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. పరీక్ష రుసుముతోపాటు, బోనఫైడ్ సర్టిఫికెట్ విధిగా ఆన్‌లైన్‌లో జమ చేయాలని కోరారు.

దరఖాస్తులకు నేటితో ఆఖరు..

శేరిలింగంపల్లి, జనవరి 17: గూగుల్ సహకారంతో కొనసాగుతున్న టాలెంట్ స్ప్రింట్ ఫర్ ఉమెన్ ఇంజినీర్స్ 6వ ఎడిషన్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థాపక సీఈఓ ఎండీ శాంతను పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరి ఉజ్వలమైన, మెరుగైన భవిష్యత్తు కోసం సాంకేతిక సామర్థ్యాన్ని వెలికితీయడం కోసం ఈ ప్రోగ్రాం ఎంతగానో దోహదపడుతుందన్నారు. మహిళా ఇంజినీర్స్ ప్రోగ్రాం విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇస్తున్నామని, గచ్చిబౌలిలోని టాలెంట్ స్ప్రింట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రాం దరఖాస్తులకు ఈ నెల 18వ తేదీ ఆఖరని పేర్కొన్నారు. అర్హులైన మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిన్నారులపై లైంగికదాడికి యత్నం

ఇద్దరు నిందితుల అరెస్ట్

అబిడ్స్,జనవరి 17: చిన్నారులపై లైంగికదాడికి యత్నించిన ఇద్దరు నిందితులను మంగళ్‌హాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై షేక్ అస్లామ్ కథనం ప్రకారం.. మంగళ్‌హాట్ పరిధిలో నివసించే ఓ నిరుపేద కుటుంబానికి చెందిన మూడు, ఏడేండ్ల వయసున్న ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఇంటిముందు ఆడుకుంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు 19, 27 ఏండ్ల యువకులు తినుబండారాలు ఇప్పిస్తామంటూ ఆశ చూపి.. కొంత దూరం వెళ్లిన తరువాత ఓ ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు పోలీసుల విచారణలో తేలింది. విషయం బయటకు పొక్కడంతో బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బాధిత చిన్నారుల స్టేట్‌మెంట్ రికార్డ్ చేసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుల్లికార్లను తయారు చేసే సుధాకర్ కార్స్ మ్యూజియంలో కొలువుదీరిన అయోధ్య రామ మందిర నిర్మాణం నమూనా. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో గురువారం నుంచి ప్రజలు సందర్శించడానికి అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

- చార్మినార్

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 17: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులైన బీహెచ్ ఎంఅండ్‌సీటీ, బీసీటీఅండ్‌సీఏ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 24 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వాయిదా పడిన పరీక్షల తేదీల ఖరారు..

ఓయూ పరిధిలో గతంలో వాయిదా పడిన బీఫార్మసీ, బీసీఏ కోర్సుల పరీక్షా తేదీలను అధికారులు ఖరారు చేశారు. సంక్రాంతి పండుగ సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 17న నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేశారు. ఆ పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను ఓయూ వెబ్‌సైట్ అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బీపీఈడీ పరీక్షా ఫలితాల విడుదల..

ఓయూ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. బీపీఈడీ రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

అభయహస్తం..డేటా ఎంట్రీ పూర్తి

- రేషన్, ఇతర పథకాలకు వచ్చిన 5.7 లక్షల దరఖాస్తుల నమోదుపై నజర్
- త్వరలో ఇంటింటి సర్వేతో దరఖాస్తుల పరిశీలన
- అర్హుల గుర్తింపు

సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అభయహస్తం దరఖాస్తుల ఎంట్రీ ప్రక్రియను జీహెచ్‌ఎంసీ ముగించింది. ఈ నెల 7వ తేదీ నుంచి దరఖాస్తుల డేటా ఎంట్రీని 5వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లతో కలిసి ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో దరఖాస్తు వివరాలను కంప్యూటరీకరించారు. ఆరు జోన్ల పరిధిలో 19,06,137 దరఖాస్తుల డేటా ఎంట్రీని మంగళవారం రాత్రి వరకే పూర్తి చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అభయహస్తం దరఖాస్తులతో పాటు అదనంగా రేషన్ కార్డు తదితర ఇతర పథకాలకు వచ్చిన 5,73,069 అప్లికేషన్ల ఎంట్రీ త్వరలో పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు.

ఇంటింటి సర్వేతో దరఖాస్తుల పరిశీలన..

దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియ ముగియడంతో అధికారుల బృందాలు ఇంటింటి సర్వే ద్వారా దరఖాస్తుల పరిశీలన చేయనున్నట్లు తెలుస్తోంది. ఏ పథకానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో! తెలుసుకునేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేరంటూ ఏమీ లేదు. అయితే ప్రజలు ఆసక్తి చూపిన ఆధారంగా..దరఖాస్తుల్లో ఎక్కువగా మహాలక్ష్మి, గృహ జ్యోతి పథకాలకే దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. మహాలక్ష్మి పథకంలో మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే గ్యాస్ బండను అందించనున్నారు. గృహ జ్యోతితో ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇవ్వనున్నారు. తదుపరి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, చేయూత దరఖాస్తులున్నట్లు తెలుస్తోంది. అభయహస్తం ఐదు పథకాలతోపాటు రేషన్ కార్డు, ఇతర వ్యక్తిగత లబ్ధికి సంబంధించి తెల్లకాగితంపై విజ్ఞప్తులు వచ్చాయి. ప్రస్తుతానికి అర్హుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. మార్గదర్శకాలు వచ్చాక మరో దఫా సర్వే చేసి అర్హుల పేర్లను పోర్టల్‌లో ఉంచుతారని అధికారవర్గాలు చెబుతున్నాయి.

అభయహస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీ వివరాలు

జోన్	దరఖాస్తుల ఎంట్రీ
ఎల్బీనగర్	2,42,579
చార్మినార్	5,08,772
ఖైరతాబాద్	3,25,641
శేరిలింగంపల్లి	1,70,811
కూకట్‌పల్లి	3,14,685
సికింద్రాబాద్	3,00,051
కంటోన్మెంట్ బోర్డు	43,598
	19,06,137

ఓఆర్ఆర్‌కు సేకరించిన భూమిని ధరణిలో నమోదు చేయించాలి

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 17 : ఓఆర్ఆర్ నిర్మాణానికి సంబంధించి సేకరించిన భూమిని ధరణిలో నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ, హెచ్ ఎండీఏ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓఆర్ఆర్ నిర్మాణానికి సంబంధించి జిల్లాలోని కీసర, ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట, దుండిగల్ గండిమైసమ్మ మండలాల పరిధిలో జరిగిన భూ సేకరణపై దృష్టి సారించాలన్నారు. హెచ్ఎండీఏ సేకరించిన భూమిని వార్డుల వారీగా పరిశీలించి, నమోదు కాని భూమిని గుర్తించాలన్నారు. అలాగే కోర్టులో అవార్డు పరిహారం మొత్తం డిపాజిట్ చేసినట్టయితే వివరాలను సమర్పించాలన్నారు.

శ్రీరామ గీతాల ఆవిష్కరణ

అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని 'ది మ్యూజిక్ గ్రూప్'సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన 'శ్రీరామ గీతం' తెలుగు, హిందీ పాటలను కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి బుధవారం ఆవిష్కరించారు.

- బన్సీలాల్‌పేట్, జనవరి 17

అయోధ్యకు తరలిన భారీ లడ్డూ..

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు చెందిన శ్రీరామ క్యాటరింగ్ సర్వీసెస్ అధినేత నాగ భూషణం రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో 1265 కిలోల లడ్డూను తయారు చేశారు. బుధవారం శ్రీరాముడి చిత్ర పటానికి పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అయోధ్యకు భారీ లడ్డూను తరలించారు.

- కంటోన్మెంట్, జనవరి 17

అత్యుత్తమ పీఎస్‌కు ఏమైంది?

- ఓ యాక్సిండెంట్ కేసులో పంజాగుట్ట సీఐ సస్పెన్షన్
- ఇంకా తేలని కొత్త సీఐ పోస్టు
- 20 రోజులుగా ఖాళీగా ఇన్‌స్పెక్టర్ కుర్చీ

ఖైరతాబాద్, జనవరి 17: ఒకప్పుడు దేశంలోనే రెండో స్థానంలో నిలిచిన పోలీస్ స్టేషన్ అది. కాని నేడు దాని ప్రాశస్త్యం కోల్పోయినట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లకు మహర్దశ పట్టింది. పోలీస్ స్టేషన్ల ఆధునీకరణ కోసం కోట్లాది రూపాయల నిధులు వెచ్చించారు. అందులో భాగంగా పంజాగుట్ట పీఎస్‌కు సుమారు కోటిన్నరతో అభివృద్ధి చేసినట్లు అప్పటి అధికారులు తెలిపారు. భారత ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎంహెచ్ఏ క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా విభాగం 2017లో ఉత్తమ పోలీసు స్టేషన్ల ఎంపిక కోసం దేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన పోలీసు స్టేషన్ల ఎంట్రీలను ఆహ్వానించగా, 140 పోలీసు స్టేషన్లు పోటీ పడ్డాయి. మౌలిక వసతులు, కేసుల విచారణ, విధులు, ఫైళ్ల నిర్వహణ, రికవరీలు, పరిశుభ్రత, సిబ్బంది పనితీరులో పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు 2018లో దేశంలోనే రెండో అత్యుత్తమ ర్యాంకు దక్కింది. అలాంటి పోలీస్ స్టేషన్ నేడు వివాదాలతో ఆదరణ కోల్పోయింది.

ఈ పీఎస్‌లో విధులు కత్తిమీద సామే..

పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో సీఎం క్యాంపు కార్యాలయంతో పాటు ప్రస్తుత ప్రజా భవన్, కీలకమైన ప్రభుత్వ శాఖ కార్యాలయాలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నివాసాలు, గవర్నర్ అధికార నివాసం రాజ్‌భవన్, నిమ్స్ దవాఖాన, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ విధులు నిర్వహించాలంటే సిబ్బందికి కత్తిమీద సాము లాంటిదే. వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండటంతో నిత్యం ఆయా రూట్‌లలో పర్యవేక్షణలో అధికారులు నిమగ్నమవుతుంటారు. ఈ నేపథ్యంలో అధికారులపై ఒత్తిడి కూడా అధికంగానే ఉంటుంది. విధుల్లో తప్పులు జరిగితే చర్యలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. తాజాగా ఓ యాక్సిడెంట్ కేసులో జోక్యం చేసుకున్న పంజాగుట్ట సీఐ దుర్గారావుపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు.

20 రోజులుగా ఇన్‌చార్జి పర్యవేక్షణలో....

గతంలో పంజాగుట్ట పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించేందుకు పోటీ పడేవారు. గత నెల 24న అర్ధరాత్రి ప్రజాభవన్ వద్ద కారు బారికేడ్‌ను ఢీకొట్టిన ఘటనలో సీఐ అలసత్వం ప్రదర్శించారంటూ దుర్గారావును ఉన్నతాధికారులు డిసెంబర్ 26న సస్పెండ్ చేశారు. ఈ కేసును స్వయంగా వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ పర్యవేక్షణ చేపట్టారు. ఈ పోలీస్ స్టేషన్‌పై ఉన్నతాధికారులు ప్రత్యేక నజర్ పెట్టడంతో ఇక్కడ విధులు నిర్వహించేందుకు కొందరు అధికారులు వెనుకాడుతున్నట్లు తెలిసింది. పైరవీలకు కూడా చాన్స్ లేకుండా పోయింది. గత 20 రోజులుగా పంజాగుట్ట సీఐ చాంబర్‌లో కుర్చీ ఖాళీగానే ఉంది. దీంతో కేసుల దర్యాప్తు, పరిష్కారాల్లో ఇన్‌చార్జి అధికారిపై భారం తప్పడం లేదు. పూర్తి స్థాయిలో పర్యవేక్షణ కూడా కరువైనట్లు చెబుతున్నారు. ప్రస్తుతం పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు అదనపు ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

వింగ్స్ ఇండియాకు సర్వం సిద్ధం

వింగ్స్ ఇండియా 2024 ప్రదర్శనకు బేగంపేట విమానాశ్రయం సిద్ధమైంది. నేటి నుంచి ప్రదర్శన కొనసాగనుంది. ఈ సందర్భంగా వివిధ రకాల విమానాలు సందర్శకులను ఆకట్టుకోనున్నాయి.